తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ| జనగాం |ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం అసిఫాబాద్
మహబూబాబాద్

మంగళవారం
23 సెప్టెంబర్ 2025

పేజీలు : 08



## నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం పర్యటన



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 22(జనంసాక్షి) :** ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మేడారం జాతరను మరింత ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నడుంబిగించింది. ఇంతకాలం మేడారం జాతరకు ప్రభుత్వాలు తాత్కాలిక ఏర్పాట్లు చేసేవి, జాతర నిర్వహణపై సమీక్షకు సైతం గతంలో ముఖ్యమంత్రులు పెద్దగా శ్రద్ధ చూపేవారు కాదు, తొలిసారిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం జాతర ఏర్పాట్లపై ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తున్నారు. అందులో భాగంగానే మంగళవారం రోజు మేడారం క్షేత్ర స్థాయి సందర్శనకు సీఎం రానున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయికి వెళ్లి జాతరకు ముందే ఏర్పాట్ల ప్రణాళిక, ప్రతిపాదనలను పరిశీలించటం ఇదే తొలిసారి. మేడారం పూజరులు, ఆదివాసీ పెద్దలు, మంత్రులు, గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రముఖులతో జాతర నిర్వహణ, కొత్త నిర్మాణాలపై ముఖ్యమంత్రి మంగళవారం మేడారంలో సమీక్ష నిర్వహించనున్నారు. ఆదివాసీ సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ ఇలవేల్పులు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలున్న ప్రాంగణాన్ని లక్షలాది భక్తులు దర్శించుకునేందుకు వీలుగా మేడారంలో భారీ ఎత్తున అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. కోట్లాది భక్తులు వచ్చే జాతర ప్రాశస్త్యానికి తగ్గట్లు భారీ ఎత్తున స్వాగత తోరణాల నిర్మాణంతో పాటు గద్దెల వద్దకు భక్తులు సులువుగా చేరుకోవడం.. గద్దెల దర్శనం... బంగారం (బెల్లం) సమర్పణ.. జంపన్న వాగులో స్నానాలచరించేందుకు మిగతా 7లో..

# వేతనాలు కోసం ఎదురుచూపు!

### పారిశుధ్య కార్మికులకు, కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు 3 నెలలుగా అందని జీతాలు

- ఆర్థిక ఇబ్బందులతో పండుగవేళ పస్తులుండాల్సిందేనా?
- ట్రెజరీలో నిలిచిన జీపీ చెక్కులు
- పంచాయతీలకు నిధుల కొరత
- అప్పులు తీసుకొచ్చి ఖర్చు చేస్తున్నాం: పంచాయతీ కార్యదర్శులు
- రెండు మూడు రోజుల్లో జీతాలు పడుతాయి : ములుగు జిల్లా డిపిఓ దేవరాజు



**ములుగు బ్యూరో, సెప్టెంబర్22(జనంసాక్షి):** పారిశ్యుద్ధ కార్మికుల (సఫాయి వారు) బతుకులు దయనీయంగా మారాయి. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి ఏర్పడింది. సఫాయి పని చేయడానికి ఏ వర్గం వారు ముందుకు రారు దళితులు, అణగారిన వర్గాలు తప్ప. ఊళ్ళో వాడ వాడ తిరిగి చెత్త ను ఇంటింటికీ తిరిగి తీసి ట్రాక్టర్ల లో వేయాలి. మురికి కాల్వలు తీయాలి. ఎప్పటికప్పుడు రోడ్లు శుభ్రం చేయాలి.ఎక్కడ వర్షపు నీరు నిలిచిన వాటిని వెంటనే తొలగించాలి.ప్రజలకు దోమల భారీ నుండి రక్షించడానికి మందులు స్ప్రే చేయాల్సి వుంటుంది. ఎక్కడైనా నీళ్ళ పైపులు పలిగితే త్రవ్వాలి అవి సరి చేసిన తరవాత పూడ్చాలి. విద్యుత్ దీపాలు పెడితే వారి వెంట వాడ వాడ తిరుగుతూ విధి దీపాలు మార్చాలి.ఎవరైనా నాయకులు అధికారులు వస్తే కుర్చీలు వేయాలి తీయాలి. ఇన్ని చేసిన ఒక కార్మికుడు సరిగా తిండి తినలేక పోతున్నాడు. డ్యూటీలో ఉన్నప్పుడు కొందరైతే సగం చినిగిన బట్టలతో కనిపిస్తున్నారు. ఇప్పటికీ జీతాలివ్వక మూడు నెలలు అవుతుందని పండగొస్తే మరీ ఇబ్బంది అవుతుందని వాపోతున్నారు మా ప్రభుత్వ కార్యక్రమాల పేరుతోని సన్మానాలు సత్కారాలు,పురస్కారాలు ప్రశంసా పత్రాలు మాకు కూడు పెట్టవు.ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి మాకొచ్చే జీతాలు వచ్చేలా చూడాలని కోరారు.

**వేతనల కోసం వేదన.. పారిశుధ్య కార్మికులకు 3 నెలలుగా అందని జీతాలు...**

పల్లెసీమలు బాగుంటేనే రాష్ట్ర,దేశ ప్రగతి బాగుంటుంది.గ్రామీణ వ్యవస్థ పట్టుగా ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తుంది.దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు అంటూ చెబుతుంటే..వినడానికి సొంపుగానే ఉన్నది.నాడు గాంధీజీ కలలుగన్నట్లుగా పచ్చగా కనిపించిన తెలంగాణ పల్లెలు మళ్లీ వెనక్కి వెళుతున్నాయి. జిల్లాలో 171 గ్రామ పంచాయతీలున్నాయి.ఈ జీపీల వారీగా 889 మంది కార్మికులు పని చేస్తున్నారు. జిల్లాలోని మెజార్టీ జీపీల్లో చాలా వరకు కార్మికులకు జీతాలు ఇవ్వాలన్నా కష్టంగా మారింది. కొద్దోగొప్పో ఉన్న చోట మాత్రమే కార్మికుల వేతనాలు ఇస్తూ అవస్థలతో నెట్టు కొస్తున్నారు.జిల్లాలోని ఒక్కొక్కచోట ఒకలా కార్మికుల జీతాల సమస్య పీడిస్తున్నది.రెండు నెలల నుంచి మొదలుకొని 3నెలల వరకు జీతాలు రాని పరిస్థితులు పలు గ్రామ పంచాయతీల్లో ఉన్నాయి.ఇలా ఒకచోట ట్రాక్టర్ మరమ్మతు సమస్య ఉంటే,మరోచోట కార్మికుల జీతాల సమస్య,ఇంకోచోట కార్మికులు పనులు మానేస్తున్న పరిస్థితులు గ్రామ పంచాయతీలను మిగతా 7లో..

## ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరం



**వరంగల్ ఎంజీఎం, సెప్టెంబర్ 22(జనంసాక్షి):** సోమవారం నాడు వరంగల్ నగరంలోని శంభునిపేట పోతన లైబ్రరీలోని పీపుల్స్ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌లో, యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ తెలంగాణ స్టేట్ చాప్టర్ మరియు అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వారంగల్ సహకారంతో 10వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వరంగల్ నగర సూపరింటెండెంట్ డాక్టర్ జె. హరికిషన్ అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అనసూర్య ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ..ఆయుర్వేదం అనేది కేవలం ఒక వైద్య పద్ధతి మాత్రమే కాకుండా, జీవన శైలి. మన రోజువారీ జీవితంలో ఆహారం, నిద్ర, ఆచారాలు, అలవాట్లు అన్ని సమతుల్యంగా ఉండేలా ఆయుర్వేదం మనకు మార్గదర్శకత్వం చేస్తుంది. రోగం వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే, రోగం రాకుండా కాపాడటమే ఆయుర్వేదం ప్రధాన లక్ష్యం. మన శరీరం, మనసు, ఆత్మ సమతుల్యతలో ఉన్నప్పుడే మనిషి ఆరోగ్యవంతుడిగా ఉంటుంది. ఈ సూత్రాన్ని మనం అందరం ఆచరించాలి.వైద్యులు రోగులను పరీక్షించి, ఉచితంగా ఔషధాలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో అనంతలక్ష్మి ప్రభుత్వ మెడికల్ కాలేజ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ బల్నే సాంబమూర్తి, యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ధర్మపురి రాజగోవిందు, భారత ప్రభుత్వ జాతీయ యువ పురస్కార గ్రహీత మండల పరశురాములు, అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అశోక్ కుమార్, ఫ్రీ మెడికల్ క్యాంప్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రవణ్, క్యాంప్ ఇన్‌చార్జ్ డాక్టర్ టీ. ఈశ్వర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. జగన్ మోహనాచార్య, డాక్టర్ పి. కల్యాణ్, డాక్టర్ జి. కవిత, డాక్టర్ సదియా తస్వీన్, డాక్టర్ ఎ. శివానీ, డాక్టర్ శ్రీజా, డాక్టర్ అఫ్రోజ్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ శివ, కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ సభ్యులు వడ్నాల నరేందర్, మంథెన సునీత, స్థానిక నాయకులు గుండు బాబురావు, నాగపురి బాలకృష్ణ, మండల సురేష్, గౌడ సమ్మయ్య, బతిని రవికుమార్, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఫార్మసిస్ట్ బైరి శంకర్, ఎంఎన్‌ఓ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఈవీఎంల గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**నిర్మల్ బ్యూరో,సెప్టెంబర్ 22(జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎంల గోదాంను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం పరిశీలించారు.గోదాంలో భద్రపరచిన బ్యాలెట్ యూనిట్లు,కంట్రోల్ యూనిట్లు,వీవీ ప్యాట్లను తనిఖీ చేసి సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతానికి ఎలాంటి లోటు ఉండకూడదని స్పష్టం చేశారు.గోదాంలో భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు.24 గంటల సెక్యూరిటీ,సీసీ కెమెరాల పర్యవేక్షణ,అగ్ని మాపక పరికరాలు తప్పనిసరిగా సిద్ధంగా ఉంచాలని సూచించారు.పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. పారదర్శకమైన ఎన్నికల కోసం అన్ని చర్యలు కచ్చితంగా అమలు చేయాలనీ కలెక్టర్ స్పష్టం చేశారు.ఈవీఎంలను పరిశీలించిన వారిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సర్ఫరాజ్,సిబ్బంది రాజశ్రీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,పోలీస్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ వాహన డ్రైవర్స్ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**నర్సంపేట సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** నర్సంపేట మున్సిపాలిటీ పురపాలక సంఘం ఆవరణ ప్రాంతంలో మున్సిపాలిటీ వాహన యంత్రాంగ డ్రైవర్స్ 24 మంది కలిసి సమావేశం ఏర్పరచుకోగా ఎన్నికలు నిర్వహించుకొని ఏకగ్రీవంగా అధ్యక్షులు ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కోశాధికారి ప్రచార కార్యదర్శి ముఖ్య సలహాదారున్ని లను డ్రైవర్స్ అందరూ కలిసి ఎన్నుకోవడం జరిగింది. భాస్కర్ అధ్యక్షులు బొచ్చు భాస్కర్,ఉపాధ్యక్షులు మాదాసి సాయికుమార్,ప్రధాన కార్యదర్శి,బొల్లెపల్లి రాంబాబు, కోశాధికారి రావుల పల్లి నాగరాజ్, ప్రచార కార్యదర్శి ఎర్ర సురేష్, ముఖ్య సలహాదారుడు అల్వాల రాజు లుగా ఎన్నుకోగా అందరూ ఆనందం వ్యక్తపరిచారు. వారు తెలిపారు కార్యక్రమంలో అధ్యక్షులు మాట్లాడుతూ పురపాలక సంఘం నర్సంపేట ప్రాంతంలో అన్ని వార్డుల్లో ప్రజలకు అందుబాటులో ఉత్తమ సేవలు అందించి అధికారులకు నర్సంపేటకు మంచి పేరు తేవాలని వారు అన్నారు.

## యూరియా పంపిణీని పరిశీలించిన వ్యవసాయ అధికారులు



**శాయంపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** శాయంపేట మండల కేంద్రంలో సోమవారం రోజు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ రవీందర్ సింగ్,సహాయ వ్యవసాయ సంచాలకులు జగదీశ్వర్ రెడ్డి , టెక్నికల్ ఏవో కే కమలాకర్ మరియు పరకాల ఏవో శ్రీనివాస్ , ఏ ఇ ఓ అర్చన శాయంపేట మండలంలో ప్రాథమిక వ్యవసాయసహకార సంఘంలో యూరియా పంపిణిని పరిశీలించారు. నానో యూరియా వాడకం మరియు దానివల్ల కలిగే లాభాల గురించి అవగాహన కలిపించారు . ఇంకా అవసరం మేరకు యూరియా పంపిణి చేయబడుతుందని రైతుల ఆందోళన చెందవద్దని సూచించారు.రైతువేదికలో వ్యవసాయశాఖ సిబ్బందికి పంట నమోదు, రైతు రిజిస్ట్రేషన్ , యూరియా కూపన్ జారిచేయడంలో తగు సూచనలు చేసారు.

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆకస్మికతనిఖీ

**మరిపెడ సెప్టెంబర్ 22(జనంసాక్షి) :** మరిపెడ మండల కేంద్రంలో మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆకస్మికంగా మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి . ఆరోగ్య కేంద్రంలో రిజిస్టర్లు తనిఖీ చేశారు. స్వస్త నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రక్త దాన శిబిరం మరిపెడ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ప్రభుత్వ విప్ డాక్టర్ డాక్టర్ రాంచంద్రు నాయక్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ రవి, డాక్టర్ పూజిత పీ,హెచ్,ఎన్,ఓ మంగమ్మ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పత్తి పంటను నాశనం చేసే ఆక్రమణదారులు



**భూపాలపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** పంట చేతికి వచ్చే సమయంలో పత్తి పంటను పీకి నానా బీభత్సవం సృష్టించిన కొంతమంది అక్రమణదారులు ఇట్టి విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవట్లేదు అనీ బాధితుడు జాలిగపు ఓదెలు జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల్ చల్లగారి గ్రామానికి చెందిన జాలిగపు ఓదెలు తండ్రి సమ్మయ్య వారసత్వం గా వచ్చిన భూమిని గత 8 సంవత్సరాలుగా ముసినిపర్తి గ్రామ శివారు సర్వేనెంబర్ 100 ఈ /2 గల సర్వే నెంబరులో 1.00 ఒక ఎకరం భూమి ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పత్తి పంట వేసి సేద్యం చేస్తున్న సమయంలో కొన్ని రోజుల క్రితం 5 ఫీట్లు ఎత్తు పెరిగిన పత్తి నీ జాలిగపు కొమురయ్య తండ్రి గట్టయ్య, జాలిగావు రాజయ్య తండ్రి ఐలయ్య, జాలిగపు తిరుపతి తండ్రి రాజయ్య, జాలీగాపు అశోక్ తండ్రి కొమరయ్య, జాలిగాపు చిన్న కొమురయ్య తండ్రి ఓదెలు, జాలియాపు అశోక్ తండ్రి కొమురయ్య, జాలిగపు భద్రయ్య తండ్రి కొమరయ్య, జాలిగపు రాజయ్య తండ్రి లచ్చయ్య, జాలిగపు శంకర్ తండ్రి రాజయ్య అదే గ్రామానికి చెందిన వారు రాత్రి సమయంలో కొడవలి గుడ్డలతో నరికి పత్తి పంటను నాశనం చేశారని అన్నారు. ఈ విషయంపై చిట్యాల పోలీస్ స్టేషన్ ఎస్ఐ కి ఫిర్యాదు చేయగా వారిపైన ఎలాంటి కేస్ పెట్టకపోగా , ఎలాంటి స్పందన లేదని దిక్కున చోట చెప్పుకోపో అని దురుసుగా ప్రవర్తిస్తున్నాడని అన్నారు. గ్రామంలో పంచాయతీ పెద్దలు చెప్పిన ప్పటికీ వినడం లేదు అని భూమి సర్వే నెంబర్లు వేరువేరు అయినప్పటికీ ఈ విషయాన్ని సర్వే చేసి చెప్పినప్పటికీ వినకుండా , ఈ విషయంలో గతంలో ఎస్సై మోకాపైకి వచ్చి చూసి నష్టం చేయ కూడదని సూచించారని అన్నారు. ఈ విషయంపై ఉన్నత అధికారులు ఎమ్మార్వో , ఎస్పీ నీ కలిసిన ప్పటికీ న్యాయం జరగలేదని ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించి తగు న్యాయం చేయగలరని కోరారు.

# దసరా పండుగకి ఊరికెళ్తున్నారా జర ఇల్లు భద్రం

- జనగామ పట్టణ , మండల ప్రజలకు జనగామ పోలీస్ వారి విజ్ఞప్తి



**జనగామ ప్రతినిధి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ఇండ్లలో చోరీలను నియంత్రణ చేసేందుకు పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంది. అలాగే చోరీల కట్టడికై ప్రజలు. ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలే తప్ప, పక్కింటి వారికి తెలిసిన వారికి ఇచ్చి మోసపోవద్దు. మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోండి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్ తో లాక్ వెయ్యడం మంచిది. నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్ మెన్/ సెక్యూరిటీ గార్డ్/ సర్వెంట్ గా నియమించుకోవాలి. సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే మీ అప్డేట్స్ పెట్టకండి. మీ ఇంట్లో స్వీయ రక్షణ సీసీ కెమెరాలను అమర్చుకోవాలి. ఆన్ లైన్లో ఎప్పటికప్పుడు మొబై ల్‌లో మీ ఇంటిని, పరిసరాలను లైవ్/ ప్రత్యేక్షంగా చూసుకొవచ్చు. సెక్యూరిటీ సర్వేలైన్స్ కు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయి. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి.ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కట్టెన్ వేయాలి. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి. ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చుమని చెప్పాలి.ఇంటి ముందు చెత్త చెదారం,న్యూస్ పేపర్స్, పాల ప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడండి. వాటిని కూడా గమనించి నేరస్థులు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉన్నది. మీ గ్రామం, పట్టణం, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్ కు తప్పని సరిగా సమాచారం ఇవ్వండి. డయల్ 100కు కాల్ చేయండి. ప్రజలు పోలీస్ శాఖ వారి సూచనలు పాటిస్తూ సహకరిస్తే చోరీల నియంత్రించడం సులభం.

# పట్టణంలో పారిశుధ్యం పడకేసింది

- జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య



**భూపాలపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** భూపాలపల్లి పట్టణంలోనీ పారిశుధ్యం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉన్నాయి.పలు కాలనీలలో సమస్యలు కంపు కొడుతున్న మున్సిపల్ అధికారులు దృష్టి సారించడం లేదని జాతీయ మాన హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు తాటికంటి రవికుమార్ ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య హాజరై మాట్లాడుతూ. .భూపాలపల్లి పట్టణంలోని విలీన గ్రామాలైనటువంటి జంగేడు,కాసింపల్లి, వేషాలపల్లి ,పుల్లూరి రామయ్యపల్లి ,కుందూరు పల్లి పెద్దకుంటపల్లి, గ్రామాలలో పారిశుధ్య పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నా చందాగా ఉన్నాయని అన్నారు . కాలనిలలో పిచ్చి మొక్కలు, చెత్త చెదారంతో నిండిపోయిన అధికారులు మొద్దు నిద్ర పోవడం సరైనటువంటి పద్ధతి కాదన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సరైనటువంటి సిబ్బంది లేక సమస్యలు తీవ్ర స్థాయికి చేరాయని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చెత్తను తీసుకుపోయేటువంటి చెత్త బండ్లు, ట్రాక్టర్లు చిన్నచిన్న రిపేర్లు ఉంటే వాటిని రిపేర్లు చేయించకుండా పక్కన పెట్టడం ఇది సరైనటువంటి పద్ధతి కాదని పేర్కొన్నారు. వాహనాలను పక్కన పెట్టడం ద్వారా తుప్పు పట్టి నష్టం జరిగే ప్రమాదం ఉన్నదని వెంటనే రిపేర్ లో ఉన్నటువంటి వాహనాలను తొందరగా రిపేర్ చేయించి వాడుకలోకి తీసుకురావాలి అని కోరారు. గ్రామాలలో మహిళలు ఎంతో ఘనంగా జరుపుకునేటువంటి సద్దుల బతుకమ్మ కార్యక్రమాల ప్రాంగణాలను ముందస్తుగానే ఏర్పాటు చేయాలని కోరారు. అంతేకాకుండా 30 వార్డులకు సరిపోయేంత పారిశుద్ధ్య కార్మికులు లేరని కొత్తవారిని నియమించి ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్యం లోపించడం వలన , కాల్వలలో బ్లీచింగ్ చల్లకపోవడం ,దోమల మందు ఫ్యాగింగ్ చేయకపోవడం వలన,కాలనీలలో కాలనీవాసులు తీవ్ర అనారోగ్యాలకు బలవుతున్నారని వారు పేర్కొన్నారు. వెంటనే కాలనీ సమస్యలను పరిష్కరించాలని దీనిపైన జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంత్రి రాకేష్ ,సోషల్ మీడియా కన్వీనర్ అమృత అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు సంగం రాజేందర్,జిల్లా అధికార ప్రతినిధి జోగుల రాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి శీలపాక నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తికి క్వింటాలకు 10075 ధర నిర్ణయించి అమలు చేయాలి




**గంగారం సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం మద్దతు నిర్ణయంలో పత్తికి క్వింటాలకు 10075 నిర్ణయించి అమలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పూనెం ప్రభాకర్ అన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నేడు గంగారం మండల ఎమ్మార్వో ఆఫీస్ ముందు నిరసన తెలియజేసి వినతి పత్రం ఇచ్చారు . అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమెరికా, ఇంగ్లాండ్ దేశాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల పత్తి దిగుమతి పై 11% సుంఖాన్ని రద్దు చేశారని ఇది భారత పత్తి రైతులకు ఉరితాడుల మారుతుందని అన్నారు. ఇప్పటికే పత్తి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధర లభించక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటుంటే విదేశాల నుండి ప్రతి దిగుమతులు పెరిగితే దేశంలోని పత్తి రైతాంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోయే ప్రమాదం ఉందని అన్నారు. అమెరికాకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం చేస్తున్న గర్జనలు సింహం ముందు పిల్లికూతల్లా మారాయని ఆయన అన్నారు. ఎమ్మెస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులకు సమగ్ర ఖర్చుల ప్రాతిపదికన మద్దతు ధరను అన్ని పంటలకు నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు అతివృష్టి వరదల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పంట లన్నింటికీ ఫసల్ బీమా యోజన వర్తింపజేయాలని బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. దశల వారి పోరాటాలలో రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ మండల నాయకులు జజ్జరీ రాము సిద్దబోయిన రాము జజ్జర సురేందర్ లక్ష్మయ్య వెంకటయ్య జిల్లా నాయకులు పూనెం రవి కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉప్పరపల్లిలో ఘనంగా పోషణ మాసోత్సవం



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మండలంలోని ఉప్పరపల్లి అంగన్వాడి కేంద్రంలో సోమవారం పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎన్ఎం రమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలలో అనేక పోషకాలు ఉంటాయని ఆకుకూరల్లో ఐరన్, క్యాల్షియం ఎక్కువగా ఉంటాయని తెలిపారు. అలాగే తల్లులకు, బాలింతలు గర్భిణీలకు పోషకాహారం ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు పి.విజయలక్ష్మి, బి. రజిత, ఆయాలు నీలమ్మ, కట్టమ్మ, శారద, ఆశ కార్యకర్తలు రాజమణి, లత, తల్లులు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

## సరస్ ఫెయిర్‌కు తరలిన సభ్యులు




**బెల్లంపల్లి, సెప్టెంబర్ 22, (జనంసాక్షి):** హైదరాబాద్ మాదాపూర్ లో జరిగే సరస్ ఫెయిర్‌కు మంచిర్యాల జిల్లా నుంచి స్వయం సహాయక సంఘాల మహిళలు తరలి వెళ్లారు. ఈనెల 18 నుంచి 29 వరకు కొనసాగే సరస్ ఫెయిర్ లో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను వీక్షించడానికి, కొనుగోలు చేయడానికి మహిళలకు అవకాశం ఉంది. కాగా ప్రతి రోజు మూడు లేదా నాలుగు జిల్లాల మహిళలు పాల్గొనే అవకాశం ఉండటంతో సోమవారం మంచిర్యాల జిల్లా నుంచి స్వయం సహాయక సంఘాల మహిళలు తరలి వెళ్లారు. కాగా బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం కుశ్నపల్లి గ్రామానికి చెందిన స్వయం సహాయక సభ్యురాలు దసలి పట్టు చేనేత వస్త్రాలు సరస్ ఫెయిర్ లో ప్రదర్శనలో పెట్టడం గమనార్హం.

## గోదావరి జలలతో చెరువులు అన్ని నింపుతాం

- ఎంపీటీసీ ఎండి మసూద్

**బచ్చన్నపేట సెప్టెంబరు 22 (జనంసాక్షి):** బచ్చన్నపేట మండలంలోని అన్ని గ్రామాల చెరువులను తపస్ పల్లి . వెల్దండ డ్యాం నుండి వచ్చే నీటితో నింపుతామని ఆలింపురం కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ ఏం డి మసూద్ అన్నారు. సోమవారం తపాస్పల్లి డ్యాం ద్వారా వచ్చే నీటితో ఆలింపురం గ్రామ చెరువు మత్తడి పోస్తుందని ఈ నీటితో బచ్చన్నపేట గుడి చెరువు నింపుతామని అన్నారు. చెరువులు అన్ని నింపనికి కృషిచేసిన జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డికి మండల రైతులు ఎంతో సంతోషంగా పడుతున్నారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ తరఫున రైతుల తరఫున ప్రతాప్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని మసూద్ అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు జ్యోతిభాస్కర్. గ్రామ శాఖ అధ్యక్షులు పాకాల కరుణాకర్. ఉపాధ్యక్షులు పర్వతంపాపయ్య. కొడవటూర్ దేవస్థానం కమిటీ డైరెక్టర్ మంతపూరి రాములు.ఇంద్రమ్మ కమిటీ సభ్యులు కరుణాకర్ రెడ్డి పరమేశ్వర్ నజీర్ మరియు జ్యోతి బైరయ్య కాంగ్రెస్ నాయకులు బంధారం క్రాంతి కుమార్. గూడ రవీందర్ రెడ్డి . చెంచు సిద్ధులు. యాకుబ్ పాషా. గూడెం రమేష్ రెడ్డి. పారుపల్లి బాలయ్య.ఉండని సంపత్.కొమ్ము శ్రీకాంత్. ఎలికట్ట కుమార నరసింహులు. గ్రామ కాంగ్రెస్ కమిటీ నాయకులు రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు

- భవాని మాలాధారణ స్వాములతో కిక్కిరిసిపోయిన నందిగుండం ఆలయం

**నిర్మల్ రూరల్,సెప్టెంబర్22 (జనంసాక్షి):** దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీగిరి నందిగుండం దుర్గామాత ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు కొండాజి వెంకటాచారి ఆధ్వర్యంలో సుమారు 4 వేలకు పైగా భక్తులకు భవాని మాలాధారణ గావించారు.ఈ మాల ధారణ కార్యక్రమానికి నిర్మల్ జిల్లాతో పాటు ఆదిలాబాద్, నిజామాబాద్,ప్రక్కనే గల మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు .మొదటి రోజు బాలత్రిపుర సుందరి దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకోవడంతో ఆలయ పరిసర ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది.తొమ్మిది రోజులపాటు అత్యంత ఘనంగా నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల విందుగా నిర్వహించడానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు.తొమ్మిది రోజులపాటు ఆలయంలో నిత్య అన్నదానం ఉంటుందని ఎవరైనా అన్నదానం కి సహకరించాలని అనుకుంటే ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు లక్కడి జగన్ మోహన్ రెడ్డి,పూజారి నరహరి,సాధం ఆనంద్ జనార్దన్,ఆలయ పూజారి సందీప్,మాలధారణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



## మహిళల ఆరోగ్యం కుటుంబ శ్రేయస్సు : డా.ప్రదీప్


- ముల్కనూరులో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం
- స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్యుల సేవలు





**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మహిళల ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు అనేవి దేశ అభివృద్ధికి పునాది.ఈ ఆలోచనతో ప్రభుత్వం చేపట్టిన స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం భాగంగా సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రత్యేక స్త్రీ వ్యాధుల నిపుణురాలు డా. హారిక హాజరై మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన చికిత్స అందించారు.స్త్రీల ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల అనేక వ్యాధులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవచ్చని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ముల్కనూర్ పీహెచ్‌సీ వైద్యులు డా.ప్రదీప్ రెడ్డి,డా.మౌనిక సమన్వయంతో గ్రామ మహిళలకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు ఈ శిబిరానికి మంచి స్పందన చూపారు. అనేక మహిళలు వైద్యులను సంప్రదించి తమ ఆరోగ్య సమస్యలను వివరించారు.మహిళల ఆరోగ్యాన్ని కాపాడితేనే కుటుంబం సశక్తం అవుతుంది.ఇటువంటి శిబిరాలు తరచూ జరగాలని కోరుకుంటున్నాం అని గ్రామస్తులు అన్నారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది చక్రధర్, రాజయ్య,సురేందర్,మహేందర్, కళ, వనజ,స్వరూప,ఉన్నారు.

# భూమికి అడ్డంగా అక్రమ నిర్మాణం



**భూపాలపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** భూమికి అడ్డంగా నిర్మించిన అక్రమ నిర్మాణం తొలగించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు .జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల్ కల్వపల్లి గ్రామానికి చెందిన పంచిక స్రవంతి మహేష్ లకు గడ్డ వెల్లె 30 ఫీట్ల మట్టి రోడ్డు అనుకొని సర్వేనంబర్ 37/ఎ/1/1/1,37/ఎ/1/1/2 , 27/ఎ/1 నందు భూమి కలదు. ఆ భూమికి అడ్డంగా, ఎటువంటి అనుమతి లేకుండా మాజీ సర్పంచ్ పులి అంజిరెడ్డి. పులి తిరుపతి రెడ్డిలు, కొంత మంది కలసి అక్రమంగా నిర్మాణం చేయుచున్నారు. ఎందుకు కడుతున్నారని అడ్డ చెప్పగా మా కుటుంబం పైన పని పిల్లల పైన దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ , రాష్ట్ర అధ్యక్షులు కొక్కు దేవేందర్ యాదవ్ , రాష్ట్ర కార్యదర్శి జక్కుల రామ్ యాదవ్ ,పంచిక మహేష్ యాదవ్ తదితరులు సమర్పించారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించి తగిన న్యాయం చేయాలని కోరారు.

# ఈనెల 25న వాహనాల వేలం

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 22, (జనంసాక్షి):** ఈనెల 25న బెల్లంపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాలను వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు ఎక్సైజ్ నేరాలలో పట్టుబడిన 21 వాహనాలను ఈనెల 25న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ఆయన వివరించారు. వేలంలో పాల్గొనే వారు వాహన విలువలో 50 శాతం ఈఎండి చెల్లించాలన్నారు. వాహనాలను పరిశీలించడానికి, ఇతర సమాచారం కోసం బెల్లంపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# నెన్నెలలో ఘనంగా శరవన్నవరాత్రి వేడుకలు



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 22, (జనంసాక్షి):** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలంలో సోమవారం దేవి శరవన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని మేళా తాళాలు, బాజా భజంత్రీలు, మంగళహారతులతో శోభ యాత్ర నిర్వహిస్తున్న వేదికపై ప్రతిష్టించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శరవన్నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారు బాల త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో దేవి నరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ పనివేళలు మార్చాలని నిరసన

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 22, (జనంసాక్షి):** బెల్లంపల్లి పట్టణంలోని బెల్లంపల్లి కాళోజి శాఖ గ్రంథాలయం పని వేళలు మార్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిరుద్యోగ యువత సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. గతంలో ఉన్న విధంగా కాకుండా గ్రంథాలయం పని వేళలు మార్చడంతో తాము పోటీ పరీక్షలకు పూర్తి స్థాయిలో ప్రిపేర్ కాలేక పోతున్నామని, మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న విధంగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 వరకు గ్రంథాలయం పనివేళలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో గ్రంథాలయం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేశారు.



# మొదటి రోజు బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన మాత



**ములుగు/ వెంకటాపూర్, సెప్టెంబర్22(జనంసాక్షి):** వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐకాన్ యూత్ దుర్గా మాత కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా మొదటిరోజు బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు.అంతకు ముందు అర్చకులు ముదుంబై వంశీకృష్ణమాచార్యులు, గిరిందర్ శర్మ,ఉప్పల బ్రహ్మచారి దుర్గా మాత విగ్రహానికి ప్రాణ ప్రతిష్టాపన చేశారు.వేద మంత్రాల తో దేవి కి మొదటి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.దుర్గామాత కమిటీ సలహా,సహకారాలు అందించే గ్రామ పెద్దలు మందల చిన్న వెంకటరమణ రెడ్డి దంపతులు, కమిటీ సభ్యులచే,గ్రామ పెద్దలతో అంగరంగ వైభవం గా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గా మాత కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కెటిపిపిలో కొలువుదీరిన దుర్గామాత



**గణపురం, సెప్టెంబర్ 22( జనంసాక్షి) :** మండలంలోని చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు లో బాగంగా సోమవారం దుర్గామాతను నెలకొల్పారు. చీఫ్ ఇంజనీర్ చిట్టాప్రగఢ ప్రకాష్ దంపతుల ఆధ్వర్యంలో కెటిపిపి దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంటు సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ కెటిపిపి విద్యుత్ కేంద్రం లో దాదాపు 2 వేల మందికి పైగా ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. అన్ని కుటుంబాలను సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఆడుతూ పాడుతూ విధులు నిర్వహించేలా క్షేమంగా ఉండేలా చూడాలని ఆ దుర్గాదేవి ని కోరుకున్న మన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల సూపరింటెండెంట్ ఇంజనీర్స్, దుర్గాదేవి ఉత్సవ కమిటీ, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

# గట్టికల్ గౌడ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

**రాయపర్తి,సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మండలంలోని గట్టికల్ గ్రామ గౌడ సం ఘం కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది.అధ్యక్షులుగా మెరుగు ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా దొనగాని యాదగిరి గౌడ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మెరుగు ప్రభాకర్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఎన్నుకోవడం సంతోషకరం అన్నారు.గౌడ సంఘం సభ్యుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.ఎన్నికలో గౌడ కులస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**గణపురం, సెప్టెంబర్ 22(జనంసాక్షి):** మండలంలోని మైలారం గ్రామంలో నేడు మంగళవారం కేంద్ర ఆయుష్ శాఖ, మంత్రిత్వ శాఖ ఆదేశాలతో ప్రతి సంవత్సరం 23 సెప్టెంబర్ తేదీని గ్లోబల్ ఆయుర్వేదిక్ దినోత్సవాన్ని పురస్కరి ంచుకుని వైద్య శిబిరం ఏర్పాటు ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుష్ శాఖ 10 వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రజలు భూగోళం కొసం అనే నినాదంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించను న్నారుగ ణపురం మండలం మైలారం గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో ఆయుష్ భూపాలపల్లి శాఖ నిర్వహించబోయే ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# సింగరేణి కార్మికులను పరామర్శించిన సిరికొండ



**జయశంకర్ భూపాలపల్లి సెప్టెంబర్22(జనంసాక్షి):** భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సింగరేణి కార్మికులను సోమవారం శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు. భూపాలపల్లి కెటికె 5 ఇంక్లైన్ లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సింగరేణి కార్మికులు క్రాంతి కుమార్, రఘులు అస్వస్థతకు గురై స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా కార్మికులను మధుసూదనాచారి పరామర్శించి, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిని వాకబు చేసి, సంబంధిత వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ బండారి సంపూర్ణ రవి, ముద్దసాని కిరణ్, అగుర్ల శ్రీనివాస్, అరిగె సుధాకర్, వెంకట్, రంజిత్ గౌడ్, జెట్టి కిరణ్, అనిల్, గుజ్జేటి రమేష్ తదితరులు ఉన్నారు.

# విద్యార్థినిని సన్మానించిన జాన్సన్



**ఖానాపూర్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** నియోజకవర్గంలోని పెంబి మండలంలోని పెంబి తాండ మాజీ సర్పంచ్ కున్స్తోత్ కరుణ విలాస్ దంపతుల కూతురు చందన ఇటీవల జరిగిన కౌన్సిలింగ్ లో వైద్య విద్య (ఎంబిబిఎస్)లో సీటు సాధించింది. విషయం తెలుసుకున్న బిఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జాన్సన్ నాయక్ సోమవారం విద్యార్థిని చందనను నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శాలువాతో సత్కరించి బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మారుమూల గ్రామంలో పుట్టి పోటాపోటీగా విద్యను అభ్యసించి వైద్య విద్య లో సీటు సాధించినం దుకు అభినందిస్తున్నట్లు తెలిపారు. అలాగే భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీర్వచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# మహేశ్వర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

**సారంగాపూర్,సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** జనహృదయ నేత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రియతమ నాయకుడు బిజెపి నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా సాగర్ కాలనీ సోమవారం నిర్మల్ లో వృద్ధాశ్రమం లో అలూరు గ్రామ నాయకులు పాతని నరసయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నరేష్, వడ్డీ రాజేందర్, చంద్రప్రకాష్ గౌడ్,ఎల్లయ్య, భూమా రెడ్డి, దయాకర్ రెడ్డి, మండల బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉన్నతాధికారులను సన్మానించిన స్పాట్ బిల్ కార్మికులు

- స్పాట్ బిల్ కార్మికులశకష్టానికి ఫలితమే గుర్తింపు



**స్టేషన్ ఘన్పూర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** డివిజన్ కేంద్రంలోని ఈఆర్ ఓ కార్యాలయంలో ఏర్పా టు చేసిన సమీక్ష సమావేశంలో దశాబ్దాలుగా ఎలాంటి గుర్తింపు లేకుండా ఇంటింటికీ తిరుగుతూ విద్యుత్ మీటర్ రీడింగ్ నమోదు చేసి బిల్లులు పంచే కార్మికుల ను యాజమాన్యం గుర్తించి టిజిఎన్పిడిసిఎల్ సిఎండి కర్ణాటి వరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో స్పాట్ బిల్ కార్మికుల కష్టాన్ని ప్రతిఫలంగా వీరికి పూర్తినెల రోజులు పనిదినా లు ఇప్పిచ్చినందుకు గాను సహకరించిన ఉన్నత అధికారులను, ఉద్యోగ సంఘాల నాయకులను స్పాట్ బిల్ కార్మికులు శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతను తెలియజేశారు. స్టేషన్ ఘనపూర్ సోమవా రం పట్టణ కేంద్రంలోని టిజిఎన్పిడిసిఎల్ సహాయ గణాంక అధికారి (ఈఆర్ ఓ) కార్యాలయంలో జిల్లా ఎస్ఏఓ ఎ జయరాజ్, డిఈ ఆపరేషన్ ఘనపూర్ వై రాంబాబు సంయుక్తంగా నిర్వహించిన సమీక్షా సమా వేశంలో డివిజన్ పరిధిలోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో పాటు స్పాట్ బిల్ కార్మికు లు పాల్గొన్నారు. ఈ సందర్బంగా జిల్లా ఎస్ఏఓ ఎ జయరాజ్, స్టేషన్ ఘనపూర్ డిఈ వై రాంబాబు, ఎఏఓ ఘనపూర్, పాల కుర్తి రమేష్, ఏడిఈ ఘనపూర్,పాలకుర్తి పి రణధీర్ రెడ్డి, శ్రీనివాస్,327యూనియన్ డివిజన్ కార్యదర్శి, సీనియర్ వర్కింగ్ ప్రసిడెంట్ బి రాజ్ కుమార్, ఎండి ఫయాజ్, స్పాట్బిల్ (పిఏ) ప్రసాద్,(ఏఈ) టెక్నీకల్ ఎం శ్వేతలను శాలువాతో ఘనం గా సన్మానించారు. ఈ సందర్బంగా ఘనపూర్ డిఈ రాంబాబు మాట్లాడు తూ గుర్తింపు అంటే గుర్తించడం కాదని, గుర్తింపు తర్వాత చేసే పనిని బట్టి ఉంటుందని,ఇప్పటి నుండి రెట్టింపు ఉత్సాహంతో కష్టపడి పనిచేయాలని కోరారు. నెల మొదటి తేదీనుండి17వరకు మీటర్ రీడింగ్ ముగించు కొని,18తారీకు నుండి నెల చివరి తేదివరకు సంభంధి త ఏఈలు సూచించిన పనులు బాధ్యతతో పూర్తి చేయాలన్నారు. స్పాట్ బిల్ రీడర్లు మీటర్ రీడింగులో ఆరితేరినవారని మంచి అనుభవంతో ఉంటారని, మీటర్ నాడి తెలిసిన వారని,అదేఅనుభవంతో మీటర్ల ను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లు ఉన్నా అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని, మీటర్లు ఇంటిలోపలఉండి మీటర్ రీడింగ్ తీయడానికి ఇబ్బందిఉన్నవి బయటకు మార్చుట,ఎక్కువ ఎత్తులో ఉండి రీడింగ్ అవుపడనివి కిందికి భిగించుట, ఎక్కువ బకాయిలు ఉన్న సర్వీసులు గుర్తించి సిబ్బంది దృష్టికి తేవడం లాంటివి నిబద్దతో పనిచేయాలని కోరారు. విద్యుత్ వినియోగదా రులు బిల్లులుబకాయిలు లేకుం డా సకాలంలో చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు, సబ్ ఇంజనీర్లు జేఏఓ నాగేందర్, జనార్ధన్, అర్చన,మోహన్,ఆర్టిజన్ సరిత,రమ్య,స్పాట్ బిల్ రీడర్లు యార కుమార్, చింత శ్రీను, రాకేష్, అలెక్స్, ఉబ్బని అనిల్, కృష్ణ, ప్రమోద్, నాగరాజు, వినోద్, సంతోష్,పాశం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## దసరా పండుగకి ఊరికెళ్తున్నారా...జర ఇల్లు భద్రం

– సీఐ జానకిరామ్ రెడ్డి



**పాలకుర్తి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ఇండ్లల్లో చోరీలను నియంత్రణ చేసేందుకు పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, అలాగే చోరీల కట్టడికై ప్రజ దసరా పండుగకు ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకో వాలే తప్ప, పక్కింటి వారికి తెలిసిన వారికి ఇచ్చి మోసపోవద్దనీ పాలకుర్తి సీఐ జానకిరామ్ రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వాహనాల ను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోవాలని. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్ తో లాక్ చేయాలన్నారు.ఇంట్లో స్వీయ రక్షణ సీసీ కెమెరాలను అమర్చుకో వాలన్నారు. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి.ఇంటికి తాళం వేసి పైన కర్టెన్ వేసుకోవాలి. గ్రామం, పట్టణం, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్ కు తప్పనిసరిగా సమాచారం ఇవ్వండి. డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

## మేయర్‌ను కలిసిన దసరా ఉత్సవ కమిటీ బాధ్యులు



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** వరంగల్ నగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణిని సోమవారం కార్పొరేషన్ లోని తన చాంబర్లో ఉరుసు కరీమా బాద్ దసరా ఉత్సవ కమిటీ బాధ్యులు కలిశారు.ఉరుసు గుట్ట రంగలీల మైదానం వద్ద నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు నగరపాలక సంస్థ తరఫున అన్ని రకాల ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు.ప్రధానంగా విద్యుత్తు లైట్లు వాటర్ బార్కెట్స్ అంతర్గత రోడ్లు శానిటేషన్ మొదలైన సౌకర్యాలు కల్పిం చాలని విన్నవించారు. లక్షలాదిగా వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగ కుండా చూడాలని కోరారు.ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమి టీ అధ్యక్షులు నాగపురి సంజయ్ బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మంద వెంకన్న, ఉపాధ్యక్షులు గోనె రాంప్రసాద్, సహాయ కోశాధికారి వెలితే శివమూర్తి, వంగరి కోటేశ్వర్ ఇతర కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

## మహాదేవ్ శక్తి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం

**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 22 ,(జనంసాక్షి):** మహాదేవ్ శక్తి సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యం లో ఈ నెల 24 నుంచి 28 వరకు ఉచిత ఆరోగ్య సేవా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ శ్రీవాణి (ఎండి ఆయుర్వేదం) ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, శివరాజ యోగి కృష్ణ స్వామీజీ వారి దివ్య శిక్షణలో ప్రాణయామాం ,యోగ, ధ్యానం, ఎనర్జీ హీలింగ్ పద్ధతుల ద్వారా అనారోగ్య సమస్యలకు మూల కారణాలను తొలగించే రోగాలను న్యాయం చేసుకునే ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. అనంతరం మందులను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. 50 మందికి మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక బంగాల్ పేట్ లోగాల రాజా శ్యామల ఆలయంలో ఈ శిబిరం ఉంటుందన్నారు.రిజిస్ట్రేషన్ కొరకు ఫోన్ నెంబర్ 8125861569 కు సంప్రదించాలని సూచించారు.

## సాకేర వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

**బోథ్, సెప్టెంబర్ 22(జనంసాక్షి):** సొనల మండలం సాకేర గ్రామ సమీపంలో ప్రైవే ట్ సంస్థకు చెందిన ట్రావెల్స్ బస్సు సోమవారం బోల్తా పడింది..రోడ్డు మధ్యలో ఉన్న గుంతను తప్పించబోయి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అదృష్టవ శాత్తు ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోగా ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయటపడ్డారు. బెంగుళూరు నుండి నేపాల్ కు పర్యాటకులతో బస్సు వెళు తుంది...ప్రమాదంలో దాదాపు వంద మందికి పైగా ప్రయాణికులు ప్రయాణిం చారు..ఘటన స్థలానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేరుకోగా వెంటనే క్షతగాత్రు లను ఆదిలాబాద్ రిమ్స్ కు తరలించారు..ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు..

## ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

**కాసిపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా పలు సమస్యలపై వచ్చిన రెండు దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి సోమ వారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, ఐసీడీఎస్ సూపర్వైజర్ రాధిక, పీఆర్ ఏఈ జగన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.



## ఖానాపూర్ చేరిన చైతన్య యాత్ర



**ఖానాపూర్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** విశ్వబ్రాహ్మణుల సమ స్యలు పరిష్కరించాలని ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుండి హైద రాబాదు వరకు చేపట్టిన చైతన్య యాత్ర సోమవారం పట్టణాని కి చేరుకుంది. పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సం దర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు మాట్లాడారు. పది మంది సభ్యులతో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మండలి ఏర్పాటు చేయాలని, ఇనుము ఆదారిత ప్రైవేటు కంపెనీల్లో 30% రిజర్వేషన్ విశ్వబ్రాహ్మణ, కమ్మరం వృత్తిదారులకు వెల్డర్లుగా సంబంధిత టెక్నీషియన్లుగా ఉపాధి కల్పించాలని తదితర డిమాండ్లతో ఈ చైతన్య యాత్ర చేపట్టామని పేర్కొన్నారు. ఈ యాత్రలో స్థానిక విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

## పండుగ పూట రైతుల కుటుంబాల్లో ఆనందం లేకుండా చేస్తున్నారు



**గణపురం, సెప్టెంబర్ 22(జనంసాక్షి):** యూరియా కొరత వల్ల రైతుల కుటుం బాల్లో దసరా సద్దుల బతుకమ్మ పండుగ ఆనం దం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని బి ఆర్ ఎస్ మం డల శాఖ అధ్యక్షులు మోతే కరుణాకర్ రెడ్డి అన్నారు. సోమవా రం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బతుకమ్మ సంబరాలు మొదలైనా రైతులకు మాత్రం యూరియా కష్టాలు తప్పడం లేదని గత బిఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో రైతులు ఒక్క సారైనా యూరియా కోసం సొసైటీల ఎదుట క్యూలో నిలబ డలేదని ఆయన అన్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తే రాత్రి ఒంటి గంటకు రైతుల కడుపు మంటలు ఆపుకోలేని స్థితిలో ఎరువుల బస్తా కోసం కాచుకొని కూర్చోవాల్సిన దుస్థితి ఎందుకొచ్చిందని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇంకో రెండు నెలల్లో కోతకు వచ్చే పంట యూరియా లేక వాడిపోతుందేమోనన్న భయం రైతులను వెంటాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియా అందించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## క్రీడాకారులుకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన స్టేషన్ ఘనపూర్ ఏసీపీ



**స్టేషన్ ఘన్పూర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో జరిగే 44వ రాష్ట్ర స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు వేల్లే జనగామ జిల్లా జూనియర్ బాల బాలిక ల జట్లకు డివిజన్ కేంద్రంలో స్టేషన్ ఘన్పూర్ ఏసిపి భీమ్ శర్మ సోమవారం క్రీడా దుస్తులు పంపిణి చేశారు. ఈ సంద ర్భంగా ఏసీపీ బీమ్ శర్మ క్రీడాకారులను ఉద్దే శించి మాట్లాడుతూ క్రీడాకారులు చెడు వ్యసనాలకు పోకుండా చదువుతో పాటు ఆటలలో రానించి రాష్ట్ర స్థాయి లో బాగా ఆడి జాతీయ స్థాయి సెలెక్ట్ కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనగా మ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెపు కుమా ర్,ఉపాధ్యక్షుడు, పిడి దేవ్ సింగ్,పిడి యాదగిరి, పిడి సంబన్న, పీఈటీలు మహా లక్ష్మి, రాజు, సుధాకర్, అజయ్, సంబరాజు, నరేష్, రందీప్, పాల్గొన్నారు.

## పేకాట స్థావరం పై పోలీసుల మెరుపు దాడి

- **29300 రూపాయల నగదు, 3 టూవీలర్లు 6 మొబైల్స్ సిజ్**

**మల్హర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మండల కేంద్రమైన తాడిచెర్ల లోని ఓ ఇంటిలో సోమవారం రహస్యంగా పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు కొయ్యూరు ఎస్ఐ వడ్లకొండ నరేష్, ఎస్ఐ 2రాజన్ కుమార్ తమ సిబ్బంది తో మెరుపు దాడి చేశారు. ఈ దాడుల్లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 29300 నగదు, మూడు టూవీలర్లు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొయ్యూరు ఎస్ఐ వడ్లకొండ నరేష్ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రైతుల గోస ప్రభుత్వానికి అధికారులకు పట్టదా

- **యూరియా కోసం అర్ధరాత్రి నుండి సొసైటీ వద్ద పడిగాపులు**
- **ధర్మసమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి కండె రవి**



**గణపురం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** నెలల తరబడి రైతులు యూరియ కోసం గోస పడుతున్నా ప్రభుత్వం అధికారం యంత్రాంగం స్పందించడం లేదని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి కండె రవి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో సోమవారం యూరియా బస్తాల కోసం రైతులు తెల్లవారుజామున ఒకటి, రెండు, గంటల నుండి కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చి ందని సొసైటీ పాలకవర్గం పోలీసు యంత్రాంగం అక్కడ లేకపోవడం వల్ల ఒక్కసారిగా లోపలికి వెళ్లి తొక్కిసలాటకు గురి కావడం జరిగిందని అన్నారు. గత వారం రోజుల నుండి సొసైటీకి యూరియా బస్తాలు రాక ఈ దుస్థితి దాపు రించిందని గతంలో కలెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారి ఈ మండలానికి వచ్చి పోవడం జరిగిందని కానీ పరిస్థితి మాత్రం మారలేదన్నారు.వారు గణపురం మండలానికి వస్తే రైతులకు జరిగిన ప్రయోజనం ఏమిటో ఈరోజు జరిగిన పరి స్థితి అర్థం అవుతుందని, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్వంత మండల ంలో రైతులకు ఈ దుస్థితి దాపరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందించకపోతే ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

## బాధిత కుటుంబానికి అంబేద్కర్ సంఘం అండగా



**రాయపర్తి,సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మండల కేంద్రంలో అంబేద్కర్ నగర్ లో ఇటీవల ఐత ఉప్పలయ్య అనారోగ్యంతో మృతిచెందగా అంబేద్కర్ సంఘం జై భీమ్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి 4000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ వాది అయిత సారయ్య,మాజీ ఎంపిటిసి అయితే రామచందర్,దళితరత్న అయిత మల్లేష్,ఎరగాల బాబు, అయిత మారుతి,అయిత రాజు,అయిత రమేష్ బాబు,ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐత రాజు మాదిగ,మండల సీనియర్ నాయకులు ఐత కుమారస్వామి,అయిత యాకుబ్,గాడిపెల్లి రవి, అయిత శ్రీనివాస్,ఐత మధు,తాటికాల ఎల్లయ్య సమ్మయ్య, మంద యాకయ్య,అయిత లాలయ్య పాల్గొన్నారు.

## జల్లిలో పోషణ మాసం



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 22(జనంసాక్షి):** మండలంలోని జల్లి గ్రామంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారం పై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్వాడి కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం తిలక్ కుమార్, సిసి కట్టయ్య, అంగన్వాడీ టీచర్లు రమాదేవి, పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలి

**పర్వతగిరి సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** టిఆర్ఎస్ పార్టీ వారు అసత్య ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు అన్నారు సోమవారం ప్రెస్ మీట్ నిర్వహించి ఆయన మాట్లాడుతూ..పల్లెల్లో ప్రశాంతంగా నిర్వహించుకునే బొడ్డెమ్మ బతుకమ్మ పండుగలను రాజకీయం చేస్తూ సాధారణ మహిళలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. మహిళలు నిర్వహించుకునే ఈ పండుగలను అన్ని కులాలు మతాలవారు సంబురంగా.నిర్వహించుకుంటారని, దీనిని బిఆర్ఎస్ పార్టీ వారు వేదికగా చేసుకుని మహిళలతో అధికార పార్టీ పై అసత్య ప్రచారాలు చేస్తూ వాటిని సోషల్ మీడియా లో పోస్ట్ చేసి ఉసిగోలపడం సిగ్గుచేటు అన్నారు. నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని మీ రాజకీయ పార్టీని వేదికగా చేసుకుని విమర్శిస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. కానీ మహిళలు ఆడుకునే సందర్భాన్ని వేదికగా వాడుకోవడం తగదన్నారు. గతంలో కల్వకుంట్ల కవిత బతుకమ్మ అంబాసిడర్ గా సృష్టించుకుని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి అబాసపాలైందని గుర్తు చేశారు. ఇప్పుడు బతుకమ్మ బొడ్డెమ్మ పండుగలను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూడడం మీ అవివేకానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంతేకాక కొంతమంది పత్రికా రిపోర్టర్లు , ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అని చెప్పుకుంటూ...తమ స్వేచ్ఛను భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారని మేము ఇతరులతో మాట్లాడే మాటలను ఎదురుగా కూర్చుని ఫోన్లో రికార్డ్ చేసి బ్లాక్ మెయిల్ చేయాలని ప్రయత్నం చేస్తున్నారని ఇలాంటి చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని అవసరమైతే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో అయినవోలు దేవస్థానం డైరెక్టర్ బందెల వెంకన్న యాదవ్, సీనియర్ నాయకులు దొనీకి కొమురయ్య, ఎస్టీ సెల్ మండల నాయకులు లచ్చుమ, దౌలత్ నగర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కత్తుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## యువజన సంఘాల నుండి దరఖాస్తుల ఆహ్వానం

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 22(జనంసాక్షి):** మేరా యువ భారత్ వరంగల్ ఉమ్మడి జిల్లాలు యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో యువజన సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడానికి యువజన సంఘాల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేరా భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మేరా యువ భారత్ మరియు యువజన సంఘాల సమన్వయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టే కార్యక్రమాలకు యువజన సంఘంలోని సభ్యుల వయసు 18 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల లోపు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చే రిజిస్ట్రేషన్ చేసుకున్న లేదా చేసుకోకపోయినా కూడా ఆసక్తి గల యువజన సంఘాల నాయకులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను యువజన సంఘాల ప్రతులను తీసుకొని వచ్చి హన్మకొండలోని న్యూ బస్టాండ్ సమీపంలో గల మేరా యువ భారత్ కార్యాలయం లో ఈనెల అనగా సెప్టెంబర్ 27వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో చేపట్టబోయే యువజన సంక్షేమ కార్యక్రమాలలో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని చెప్పారు. మరిన్ని వివరాల కొరకు 0870-2958776 సంప్రదించగలరని తెలిపారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



**శాయంపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** శాయంపేట మండలంలో ఇందిరమ్మ ఇల్లుల లబ్దిదారులకు తరలించే ఇసుక రవాణా గురించి శాయంపేట సీఐ రంజిత్ రావు, శాయంపేట ఎస్సై పరమేశ్వర్, ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో ఫణి చంద్ర అవగాహనా కల్పిస్తూ, ఇసుక తరలించే వాహనాలకు లైసెన్స్ కలిగి ఉండాలని, మరియు కూపన్లు కలిగి ఉండాలని, ఇసుకను ఎక్కువ రేట్లకు అమ్మకూడదని తెలియజేసారు. ఇట్టి నియమాలను పాటించకపోతే కఠిన చర్యలు తీసుకోబడును అని ఈ సందర్బంగా హెచ్చరించడం జరిగింది.

## తాడిచర్ల ఓసీపీని సందర్శించిన డైరెక్టర్ కోల్ నాగ్య

**మల్హర్, సెప్టెంబర్ 22(జనంసాక్షి):** తాడిచర్ల ఓసీపీని సొమవారం డైరెక్టర్ కోల్ బీ నాగ్య (ఐఆర్టీఎస్) సందర్శించారు. గత ఏడాది ఓసీపీలో చేపట్టిన బొగ్గు ఉత్పత్తి, ఈ ఏడాది ఇప్పటి వరకు తీసిన బొగ్గు ఉత్పత్తి, నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం పై చర్చించారు. అలాగే డేంజర్ జోన్ను పరిశీలించి, కన్వేయర్ బెల్టు పనుల పురోగతి పై చర్చించారు. ఓసీపీకి సేఫ్టీ, రక్షణ, స్టార్ రేటింగ్ అవార్డు లు రావడం పట్ల సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్మార్ సీఈవో డీఎల్ఆర్ ప్రసాద్, కే టీపీపీ సీఈ శ్రీప్రకాష్, ఎస్ఈలు రామకృష్ణ, ముత్యాలరావు, జెన్ కో జీఎం మోహన్రావు, ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, సీనియర్ జనరల్ మేనేజర్ కేఎస్ఎన్. మూర్తి, మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టి ఆఫీసర్ సురేష్ బాబు, డీజీఎం సర్వే సర్వోత్తమ్, డీజీఎం మెకానికల్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.




## ఎస్ఐని సన్మానించిన నాగులమ్మ ప్రెస్ క్లబ్



**మల్హర్, సెప్టెంబర్ 22(జనంసాక్షి):** నాగులమ్మ నూతన ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కొయ్యూరు ఎస్ఐ వడ్లకొండ నరేష్,ఎస్ఐ 2 రాజన్ కుమార్ లను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగులమ్మ ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు వీరమనేని సంపత్ రావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బుర్ర సుధాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్, ఉపాధ్యక్షులు రాగం కుమార్, జాయింట్ సెక్రటరీ గా మడుగురి నాగరాజు, కోశాధికారి జల్లారపు ప్రసాద్, ప్రెస్ క్లబ్ సభ్యులు చొప్పరి రాజయ్య, చొప్పరి రాజు, లింగన్న పేట శ్రీనాథ్,చింధం భాస్కర్ పాల్గొన్నారు.

## చట్ల కుమారస్వామికి పాలధార

### పాట పుస్తకం అందజేత



**స్టేషన్ ఘన్పూర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** హైదరాబాదులోని మఖ్దూం భవన్ లో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలధార పాట పుస్తక ఆవిష్కరణ సభలో ప్రొఫెసర్ కోదండ రామ్, గద్దర్ ఫౌండేషన్ ఫౌండర్ సూర్య కిరణన్న చేతుల మీదుగా మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన రచయి త, గాయకుడు చట్ల కుమారస్వామికి గద్దర్ యాధిలో పాలధార పాట పుస్తకం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా చెట్ల కుమారస్వామి మాట్లాడుతూ పాల ధార పాట పుస్తకంలో 33 జిల్లాల నుండి 119 మంది రచయితలు ఒక్కొక్కరు ఒక్కో పాట రాయగా తను కూడా ఒక పాట రాయడం జరిగింది అన్నారు. రచయి తలందరికీ పాలధారపాట పుస్తకాన్ని ప్రముఖుల చేతు లమీదుగా అందజేయటం జరిగిందని అన్నారు.తనను గుర్తించిన పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## నిర్మల్ పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు

### ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్ రూరల్,సెప్టెంబర్22(జనంసాక్షి):** నిర్మల్ పట్టణ పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సోమవారం తెలిపారు.పట్టణ అభివృద్ధి పనులకు15కోట్ల నిధులు,ఎస్ టి పి ప్లాంట్ల (మురుగునీటి శుద్ధి కేంద్రాలు)ఏర్పాటుకు 42కోట్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు.పట్టణంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజ్ ల నిర్మాణానికి,పలు అభివృద్ధి పనులకు ఈ నిధులు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు.దసరా అనంతరం పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.

# వేతనాలు కోసం ఎదురుచూపు!

పీడిస్తున్నాయి.

**పండుగ పూట పస్తులేనా..?**

గ్రామ పంచాయతీ కార్మికులకు తెలంగాణ లో అతి పెద్ద పండుగ బతుకమ్మ,దసరా పండుగా సందర్భంగానైనా జీతాలు అందుతాయని ఆశించా రు.మూడు నెలల జీతాలు పెండింగ్లో ఉంచడంతో కార్మికులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని 9మండలాల్లోని గ్రామాల్లో ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క పరిస్థితి ఉంది.ఇంకాను పెద్ద జీపీలు,మధ్యస్థ జీపీల్లో పనిచేస్తున్న కార్మికుల జీతాల స్థితిగతులు ఒకలా.. చిన్న జీపీల కార్మికుల పరిస్థితులు మరొకలా ఉన్నాయి.చివరకు పండుగకైనా జీతాలందుతాయన్న కార్మికుల ఆశలు అడియాశలవుతున్నాయి. ప్రతినెలా కార్మికుల జీతాల కోసం గ్రామ కార్యదర్శులు చెక్కులు కొట్టి ట్రెజరీ కార్యాలయాలకు పంపిస్తారు.ఇది ప్రతినెలా ఓతంతులా మారింది తప్పా ఎలాంటి ఉపయోగం లేదు. ఇదిలా ఉంటే.. జిల్లాలో 3 నెలలుగా జీతాలందుకోని గ్రామ పంచాయతీలున్నాయి. మరికొన్ని 1,2 నెలల వారీగా జీతాలు అందని గ్రామ పంచాయతీలున్నాయి. ప్రస్తుతం రెండు నెలలు నెలలకు సంబంధించి కార్మికుల జీతాలను టీఎస్ బీపాస్ ద్వారా చెల్లించాలని ప్రభుత్వం నిధులను విడుదల చేసింది.

**మూడు నెలలు గా జీతాల్లేవు : రామయ్య, కార్మికుడు, నల్లగుంట, వెంకటాపూర్ మండలం**

మూడు నెలల నుంచి జీతం ఇవ్వకుంటే మేం ఏం తినాలి.ఎలా పని చేయాలి. మాలాంటి చిన్న కుటుంబాలు నెలకు జీతం వస్తేనే నడిచేది కష్టం.మూడు నెలలు పెండింగ్ పెడితే మేం ఎవరికి చెప్పాలి.మా కొచ్చే చిన్న జీతాలు ఇవ్వకపోవడం దారుణం. ఇక నెలల కొద్ది రాకుంటే మా కష్టాలు ఎవరికి చెప్పాలే.సర్కారు మాకు చెల్లించాల్సిన బకాయిలన్నీ వెంటనే చెల్లించాలి.

**రెండు రోజుల్లో జీతాలొస్తాయి : దేవరాజు, జిల్లా పంచాయతీ అధికారి, ములుగు**

ట్రెజరీల్లో వేసిన జీపీ కార్మికుల చెక్కులు పెండింగ్లో ఉన్నాయి. ప్రస్తుతం రెండు రోజుల్లో రెండు నెలలకు సంబంధించిన కార్మికుల జీతాలను టీఎస్ బీపాస్ ద్వారా చెల్లించే విధంగా నిధులు విడుదల అయ్యాయి.ప్రభుత్వ స్థాయిలోనే ట్రెజరీ చెక్కులు పెండింగ్ ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయం మేరకు పెండింగ్ చెక్కులు కూడా క్లియర్ అవుతాయి.ఈ వారం లో జీతాలు అందరికీ పడుతాయి.



## వడ్లకొండ యాకయ్యకు ఘన సన్మానం

**గూడూరు,సెప్టెంబర్22(జనంసాక్షి):** గూడూరు మండలంలోని చిన్నఎల్లపూర్, భూపతిపేట, వెంగంపేట మూడు గ్రామాలకు గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా వడ్లకొండ యకయ్య ఎన్నికైన సందర్భంగా సోమవారం వడ్లకొండ యాకయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. గూడూరు మండల బీజేపీ అధ్యక్షులు రాసమల్ల వేంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మాజీ ఎంపీపీ చేల్పూరి వెంకన్న, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొణిదల సంపత్, మాదారపు సాంబయ్య,సీతారాం నాయక్, లాల్ సింగ్,గుజ్జ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ తొర్రూరు మండల అధ్యక్షుడిగా నాగరబోయిన సాయిలు

**తొర్రూరు, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ తొర్రూరు మండల అధ్యక్షుడిగా నాగరబోయిన సాయిలు నియమితులయ్యారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వారికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు సాయిలు మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని అన్నారు. నాపై నమ్మకంతో మండల అధ్యక్ష పదవి అప్పగించిన మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



## ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమం

- మండలంలో 12గ్రామాలు ఎంపిక



**గూడూరు, సెప్టెంబర్22 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేసిన సందర్భంగా ఆది కర్మ యోగి అభియాన్ రెండు రోజుల మండల స్థాయి అవగాహన కార్యక్రమం సోమవారం గూడూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ప్రారంభమైంది.ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమం ఆది కర్మయోగి అభియాన్ రూపొందించిందని ఇందులో గ్రామస్థాయిలో పనిచేసే వివిధ శాఖలు సమిష్టిగా ముందుకు వెళ్లి, గిరిజన తండాలు,గూడాల అభివృద్ధికి కిందిస్థాయి నుంచి పాటుపడేలా కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. గూడూరు మండలంలో 12 గ్రామాలు ఈ కార్యక్రమం కింద ఎంపిక కావడం జరిగిందని,ఆ గ్రామస్థాయి వివిధ శాఖల ఉద్యోగులకు నేడు మండల స్థాయిలో ఎంఈఓ రవికుమార్ ఎఫ్ఆర్ఓ చిట్టిబాబు,ఏపీఎం వీరయ్య,ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీకాంత్,ఐసిడిఎస్ సూపర్వైజర్ కళావతి, ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని కొనసాగించారు. మండలంలోని గుండెంగా, పొనుగోడు,తీగల వేణి,అప్పరాజుపల్లి,కొల్లాపురం, బొద్దుగొండ,మచ్చర్ల,ఊట్ల, మట్టేవాడ,కోబల్ తండా, దామరవంచ,గోవిందాపురం గ్రామాల నుంచి విద్య,వైద్యం, ఆరోగ్యం,మంచినీరు,వెలుగు, ఐసిడిఎస్,శాఖల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ దొందూదొందే..

- బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ

**శాయంపేట ,సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** శాయంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు ఇద్దరూ ఇసుక భూభకసురులేనని నియోజకవర్గంలో గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ ప్రజాధనాన్ని దోచుకున్నారని అన్నారు. అదేవిధంగా మండలంలో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలుఒకరిపై ఒకరు భూమి కబ్జా ఆరోపణ చేసుకుంటున్నారని ,ఈ రెండు పార్టీల చరిత్ర అవినీతి ,దోపిడేనని ప్రజా సమస్యలు గాలికి వదిలేసారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్



రాయరాకుల మొగిలి ,జిల్లా ఉపాధ్యక్షురాలు కోడెపాక స్వరూప, మండల ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి జిల్లా నాయకులు ఉప్పురాజు, కొత్తపల్లి శ్రీకాంత్, మంద సురేష్, మండల ఉపాధ్యక్షులు కోమటి రాజశేఖర్, మండల కార్యదర్శి మేకల సుమన్, మండల కోశాధికారి కుక్కల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులను విమర్శిస్తే పుట్టగతులుండవు

- మండల అధ్యక్షులు సట్ల రవి గౌడ్

**టేకుమట్ల సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి మండలంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు టేకుమట్ల మండల ప్రభుత్వ అధికారులను మీ కాంగ్రెస్ పార్టీ నాయకులను అదుపు లో పెట్టలేని అసమర్థుడు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అని టేకుమట్ల బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి అన్నారు. ఈ సందర్భంగా టేకుమట్ల మాట్లాడుతూ చిల్లర గాళ్ళతో ప్రెస్ మీట్ పెట్టించి మా నాయకుడు రమణారెడ్డి పై మాట్లాడిస్తే నీ స్థాయి పెరుగుతుంది అనుకుంటున్నావా గండ్ర సత్యనారాయణ రావు.నీ మీద మా కార్యకర్తలు విరుచుకు పడితే భూపాలపల్లి లో నీకు పుట్టగతులు ఉండవు అని హెచ్చరించారు. విచ్చల విడిగా ఇసుక దోపిడీ చేస్తున్నది మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు , భూపాలపల్లి ఎమ్మెల్యే కాదా ఏ పని లేని ఎమ్మెల్యేకు మూడు సార్లు ఎమ్మెల్యే గా పోటీ చేయడానికి డబ్బు ఎక్కడి నుండి వచ్చింది చెప్పాలని అన్నారు. జడ్పీటీసీ పదవి లో ఉండి ప్రజలకు వచ్చిన బియ్యాన్ని అమ్ముకొని పందికొక్కుల మెక్కింది ఎమ్మెల్యే కాదా అని అన్నారు.భూపాలపల్లి లో అధికారులను బిజినెస్ చేసుకునే వాళ్ళను బ్లాక్ మెయిల్ చేసి డబ్బు దండుకొని బినామీల పేర్లతో ఆస్తులు సంపాధించుకున్నది భూపాలపల్లి ప్రజలకు తెలువయని అనుకుంటున్నావా అని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో గుళ్ళు బదుల పేరుతో ఇసుకను డంపు చేసి సిగ్గు లేకుండా అమ్ముకుంటున్నది మీరేనని అన్నారు. భూపాలపల్లి లో పని చేస్తున్న అధికారులు ఎమ్మెల్యే కు బానిసలుగా మారవద్దని మీ ఆత్మ గౌరవాన్ని కాంగ్రెస్ పార్టీ కి తాకట్టు పెట్టకండని ప్రజల సమస్యలు తీర్చడానికి మాత్రమే పని చేయాలని కోరారు.

### నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## మేడారం పర్యటన

అవసరమైన ఏర్పాట్లు చేయనున్నారు. మేడారం అభివృద్ధి పనుల్లో గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ఎటువంటి భంగం కలగవద్దనే కృతనిశ్చయంతో ఉన్న ప్రజా ప్రభుత్వం ప్రతి నిర్మాణం.. ప్రతి కట్టడాన్ని పూర్తిగా ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా, మేడారం జాతర పూజారులు, ఆదివాసీ పెద్దల సూచనలతో ప్రభుత్వం చేపట్టనుంది.నిర్మాణాల్లో విలువైన గ్రానైట్, లైమ్స్టోన్ రాళ్లను వాడనున్నారు. పురాతన ఆలయాల పునఃనిర్మాణం, ప్రసిద్ధ ఆలయాల్లో అభివృద్ధి పనుల్లో ప్రసిద్ధుడైన స్థపతి ఈమని శివనాగిరెడ్డి సేవలను మేడారం అభివృద్ధి పనులకు ప్రభుత్వం వినియోగించుకుంటోంది. ప్రపంచ పటంలో జాతరకు మరింత వన్నె తేవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఆదివాసీల సంప్రదాయాలు, ఆకాంక్షలకు అద్దంపట్టేలా మేడారం జాతరను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు తయారు చేయాలని ఇటీవలే సీఎం అధికారులను ఆదేశించారు.

రెండేళ్లకోసారి జరిగే మహా జాతరతో పాటు ఏడాది పొడవునా అన్ని రోజుల్లో మేడారం వచ్చి గద్దెలను దర్శించుకునే భక్తుల సంఖ్య పెరిగింది. వీకెండ్, సెలవు దినాల్లో ఈ రద్దీ మరింత పెరుగుతోంది. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన వసతి, సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. మేడారం అభివృద్ధి పనులతో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేయటంతో పాటు ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రభుత్వం ఊతమివ్వనుంది. ఫలితంగా మేడారం సమీపంలో ఉన్న రామప్ప, ఇతర ఆలయాలకు భక్తుల సంఖ్య పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

## సీఎండీకి అన్మన్ కార్మికులు వినతి



**ఆత్మకూరు, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):** సోమవారం రోజు హనుమకొండలో టీజీఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి ని కలిసి అన్మాను కార్మికుల సమస్యల వినతి పత్రం ఇచ్చారు. అన్మాన్ కార్మికులను ఆర్టిజన్ గా గుర్తించాలని గుర్తించేలోపు, రెగ్యులర్ ఉద్యోగులతో పాటు అన్ని సమాన హక్కులు కల్పించాలని, ముఖ్యంగా వేరియబుల్ డైలీ అలవెన్స్ 2018 నుండి ఇవ్వాల్సి ఉండగా, అక్టోబర్ నుంచి రాబోయే నూతన అగ్రిమెంట్లో విడిఏ అమౌంట్ ఏరియర్స్ తో పాటు కలిపి ఇవ్వాలని కోరడం జరిగింది. సీఎండీ స్పందిస్తూ సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తానని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు హన్మకొండ జిల్లా అధ్యక్షులు బూర వరుణ్ గౌడ్ వెంకటేష్, శివకుమార్ పాల్గొన్నారు.

## అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వెంటనే సమాచారం ఇవ్వండి

- ముల్కనూర్ ఎస్సై ఎం. రాజు



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** వరంగల్ పరిసర ప్రాంతాల్లో ఆరుగురు వ్యక్తులతో కూడిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠా తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతోందని ముల్కనూర్ ఎస్సై ఎం. రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దసరా సెలవుల కారణంగా చాలా కుటుంబాలు వేరే ఊర్లకు వెళ్తున్న నేపథ్యంలో ఇంట్లో విలువైన వస్తువులను భద్రంగా ఉంచాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా ముల్కనూర్ భీమదేవరపల్లి మండల పరిధిలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వెంటనే తెలియజేయాలని సూచించారు.

# డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధనకు దశలవారీగా పోరాటాలను ఉధృతం చేద్దాం

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గునగంటి రాజయ్య**



**తొర్రూరు, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు కొరకు దేశల వారీగా పోరాటాన్ని ఉదృతం చేస్తామని సిపిఎం పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుణగంటి రాజయ్య అన్నారు. నాలుగవ రోజు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దగ్గర లబ్ధిదారులతో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి కొమ్మనబోయిన యాకయ్య అధ్యక్షతన లబ్ధిదారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుణగంటి రాజన్న మాట్లాడుతూ, గత మూడు నెలలుగా డబుల్ బెడ్ రూమ్ లో ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు పంచాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ తోరూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో అనేక దఫాల ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కూడా ప్రభుత్వం నుండి గాని, అధికారుల నుండి గాని ఎలాంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 45 రోజులు సమయం ఇచ్చిన అధికారులు ఎక్కడ జాడ కనపడడం లేదని, ఎప్పటి వరకు రాజకీయ నాయకులే అబద్ధాలు ఆడతారు అనుకుంటే, అధికారులు కూడా అబద్ధాలు చెప్పేవారు అయ్యారని వారు సందర్భంగా గుర్తుకు చేశారు. తొర్రూర్ మున్సిపాలిటీ కేంద్రంలో కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కడితే గత ప్రభుత్వం పేదలకు ఇండ్లు పంచలేదు. ఇప్పుడు ఎన్నికైన ప్రభుత్వం సుమారు రెండు సంవత్సరాలు అవుతున్నప్పటికీ కూడా ఈ డబల్ బెడ్ రూమ్ లను పంచడం లేదని వారు అసహనం వ్యక్తం చేశారు. కోట్ల రూపాయలు వెచ్చించి కఠిన ఇండ్లు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని వెంటనే అర్హులైనటువంటి లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల పార్టీ, లబ్ధిదారులందరినీ కలుపుకొని దశలవారీగా పోరాటాన్ని ఉధృతం చేయాలని వారు అన్నారు. ఈనెల 23న పట్టణ కేంద్రంలో లబ్ధిదారులందరితో కలిసి ర్యాలీ నిర్వహించాలని, 27వ తేదీన ఆర్డీవో ఆఫీస్ ముందు నిర్వహించే మహాధర్నా కు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులందరి కలుపుకొని మహాధర్నా నిర్వహిస్తామని వారి సందర్భంగా ప్రభుత్వాన్ని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, పార్టీ మండల కార్యదర్శి ఎండి యాకుబ్, మండల కమిటీ సభ్యులు జముల శ్రీను, డొనక దర్గయ్య ,ఎండి నజీర్, తిమ్మిడి రవి, గడల మల్లయ్య, సాయిలు, ధర్మయ్య, ఎండి షమీనా, శోభ, వరలక్ష్మి ,శ్రీలత , రెడ్డబోయిన అరుణ, రేణుక , నాగమణి ,అమీనా, సౌజన్య, యాకమ్మ ,కమలమ్మ, స్వరూప భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కౌట్ల బి గ్రామస్తులు

**నిర్మల్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో సారంగాపూర్ మండల కౌట్ల బి గ్రామస్తులు ఆయనను సోమవారం మర్యాద పూర్వకంగా కలసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.గ్రామంలో రైతులు ఎక్కువగా ఉండటం వల్ల నాగలిని బహుకరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సాదు రాంరెడ్డి, తీగల మోహన్, ఐరా రాజారెడ్డి, ఇప్ప శ్రీకాంత్, మోహన్ రెడ్డి, రమేష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డిలు నిర్మల్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి పూలగుచ్ఛం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ, "ఎమ్మెల్యే ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తూ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని కోరుకుంటున్నాం. ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలి" అని అభిలాషించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు జిల్లాకు

# ఏం చేస్తారో చెప్పి అడుగు పెట్టాలి

- **వనదేవతల సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు జిల్లాకు ఏం చేశారో చెప్పాలి**
- **బిఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగ జ్యోతి డిమాండ్**



ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 22(జనంసాక్షి) : వనదేవతల సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు జిల్లాకు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. ములుగు నియోజకవర్గానికి గత ప్రభుత్వంలో తెచ్చిన నిధులు మాత్రమే కాంగ్రెస్ పార్టీ పనులు ప్రారంభించి మేమే చేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప అభివృద్ధి ఎక్కడ కనబడడం లేదని బడే నాగ జ్యోతి ఆరోపించారు. రైతులకు అవసరమైన ఎరువులను సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, జిల్లా లో సరిపడా యూరియా లేదంటూ వ్యవసాయ శాఖ బాహాటంగానే ఒప్పుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్టగా నిలిచిందని, అటు కేంద్రంలో బీజేపీ, ఇటు రాష్ట్ర లో కాంగ్రెస్ సర్కార్ వైఫల్యంతో తెలంగాణలో అన్నదాతలకు కష్టాలు మొదలయ్యాయని తెలిపారు. జిల్లాలలో వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని రైతులు కోరిన కూడా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమైన విషయం. ఇప్పటికైనా ముఖ్యమంత్రి గా స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. అర్హులకు, నిజమైన పేదలకు ఇల్లు రావాలని మాట్లాడినందుకు కాంగ్రెస్ సర్కారు చుక్క రమేష్ మీద కక్షగట్టి ప్రాణాలు తీసుకుందని మండిపడ్డారు. ములుగు జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా మంజూరు పత్రాలు ఇప్పిస్తూ వారు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేసి దోపిడి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అక్రమాలు బయటపెట్టిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ పైన మంత్రి మనుషులు కాంగ్రెస్ గుండాలు దాడి చేశారని అన్నారు. కేవలం ములుగులోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా కూడా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల అరాచకాలు పెచ్చు మీరిపోతున్నాయని ఆరోపించారు. పేదల నుంచి అడ్డగోలుగా దండుకుంటున్నారని, లేకపోతే ఇల్లు ఇచ్చేది లేదని బెదిరిస్తున్నారని, పట్టాలు ఇచ్చిన తర్వాత కూడా రద్దు చేయిస్తున్నారని వివరించారు. కాంగ్రెస్ కార్యకర్తలకు, రూ. 50 వేల నుండి లక్ష రూపాయలు లంచం ఇచ్చే వాళ్లకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. మేడారంలో పరిసర ప్రాంతాలలో భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని ధర్నా రాస్తారోకోలు చేస్తున్న కూడా ప్రభుత్వం స్పందించడం లేదని ఆమె అన్నారు. అదేవిధంగా అడవిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆదివాసుల గుడిసెలను కాంగ్రెస్ ప్రభుత్వం లో ఫారెస్ట్ అధికారులు పోలీసులను పెట్టి గుడిసెలను కూలగొట్టడం దురదృష్టకరమైన విషయమని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో ఇచ్చిన విధంగా 6 గ్యారంటీలు ప్రభుత్వం విస్మరించిందని ఆమె తెలిపారు. మహిళలకు ఇస్తున్న 2500 రూపాయలు ఏమయ్యాయి అని ప్రజలు నిలదీస్తున్నారని ఆ ప్రభుత్వం పై మండిపడ్డారు. పెళ్లయిన ఆడపిల్లలకు ఇస్తానన్న తులం బంగారం ఏమైందని, వృద్ధులకు ఇస్తానన్న 4000 రూపాయలు ఏమయ్యాయి అని, వికలాంగులకు వేస్తానన్న 6000 రూపాయలు ఏమయ్యాయి అని ప్రభుత్వాన్ని నిలదీశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ములుగు జిల్లాకు మెడికల్ కాలేజ్ తో పాటు కలెక్టరేట్ భవనాలు, ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, మల్లంపల్లి మండలం, తండాలను పంచాయితీలు, గ్రామ గ్రామాన సిసి రోడ్లు, పల్లె ప్రకృతి వనాలు, ట్రాక్టర్లు, గ్రామపంచాయతీలకు భవనాలు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, 24 గంటల కరెంటు ఇచ్చిన ఘనత కేసీఆర్ దేనని ఆమె కొనియాడారు.

# ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం ఫెర్టిలైజర్ షాప్ యజమానికి షోకాజ్ నోటీస్



**మహదేవపూర్, సెప్టెంబర్ 22( జనంసాక్షి) :** మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం2 ఫెర్టిలైజర్ షాప్ యజమానికి షో కాజ్ నోటీస్ జారీ చేసిన వ్యవసాయ అధికారిని సుప్రజ్యోతి. సోమవారం రోజున వ్యవసాయ అధికారి సుప్ర జ్యోతి తన సిబ్బందితో కలిసి రైతు సేవా కేంద్రం పెటిలైజర్ షాప్ల లో స్టాక్ తో పాటు బిల్ బుక్ తనిఖీ నిర్వహించగా 3 రైతులకునగదు రషీద్ బిల్లులు జారీ చేయకుండా 6 యూరియా సంచులను విక్రయించారని ఎఫ్ సి ఓ ప్రకారం షాప్ టు పై చర్యలు తీసుకోని షో కాల్స్ నోటీస్ జారీచేసి లైసెన్స్ సస్పెన్షన్కు సిఫారసు చేయబడిందని ఏవో తెలిపారు.

# మండపాలల్లో కొలువుతీరిన అమ్మవారు..

**భక్తులతో కిటకిటలాడుతున్న మండపాలు...**

కడెం, సెప్టెంబర్ 22(జనం సాక్షి) శరన్నవరాత్రులను పురస్కరించుకొని మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాత కమిటీలు, విడీసీ సభ్యులు గ్రామస్తుల ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాలని గ్రామాలలో డీజే, డప్పులు, సన్నాయిల చప్పులతో ఆటపాటలతో ఆడబిడ్డలు మంగళ హారతులు పట్టుకొని ఆహ్వానం పలుకుతూ ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాలల్లో కొలువు తీర్చారు. దివి నుండి భూవి పైకి దిగివచ్చిన అమ్మవారు మొదటి రోజున శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. శరన్నవరాత్రి సందర్భంగా గ్రామాలలో భక్తులతో మండపాలు కిటకిటలాడాయి. దర్శనం ఇచ్చిన అమ్మవారికి ఆయా పలు గ్రామాలతో పాటు మాసాయిపేట్ గ్రామంలో అనంతరం అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అర్చకులు రేవంత్ శర్మ, ఆదినారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని వారి ముడుపులు చెల్లించారు. తదుపరి మండపం వద్ద అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో మండపాల కమిటీ సభ్యులు, గ్రామ వీడిసిల పెద్దలు, గ్రామస్తులు భక్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# నిర్మల్ పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు

**ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి**



**నిర్మల్ రూరల్, సెప్టెంబర్22 (జనం సాక్షి) :** నిర్మల్ పట్టణ పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సోమవారం తెలిపారు.పట్టణ అభివృద్ధి పనులకు15కోట్ల నిధులు,ఎస్ టి పి ప్లాంట్ ల (మురుగునీటి శుద్ధి కేంద్రాలు)ఏర్పాటుకు 42కోట్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు.పట్టణంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజ్ ల నిర్మాణానికి,పలు అభివృద్ధి పనులకు ఈ నిధులు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు.దసరా అనంతరం పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.